కాంగ్రెస్ హామీలు నీటి మూటలు

ముంజంపల్లి కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

- బోనస్ పైసలు దేవుడెరుగు.. ఉన్న ధాన్యమే కొంటలేరు
- కౌలు రైతులకు రూ.12 వేల సాయమేది
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ధ్వజం
- ముంజంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 23: మార్పు తెస్తాం.. అందరినీ ఉద్ధరిస్తాం.. రైతుల బాధలు తీరుస్తామన్న కాంగ్రెస్ నాయకుల హామీలు వట్టి నీటి మూటలుగా మారిపోయాయని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. రైతు రాజ్యమంటే.. రైతుల నోట్లో మట్టి కొట్టడమేనా? అని ప్రశ్నించారు. మంగళవారం మానకొండూర్ మండలం ముంజంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి సందర్శించారు. రైతులతో పాటు సెంటర్ ఇన్‌చార్జితో మాట్లాడారు. కేంద్రంలోని సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని నమ్మబలికిన రేవంత్‌రెడ్డి, వానకాలం పంట నుంచి ఇస్తామనడమేంటని ప్రశ్నించారు. సీఎం మాటలు గాలి మాటలే అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా ఉన్నరు-నేను మోసం చేస్తానంటున్నట్లు ముఖ్యమంత్రి వ్యవహార తీరు ఉందని దుయ్యబట్టారు. బోనస్ పైసలు దేవుడెరుగు కానీ ఉన్న ధాన్యమే కొంటలేరని, కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో లేవని, ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. డిసెంబర్ 9, 2023 సంవత్సరంలోనే రుణమాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, వచ్చే ఆగస్టు 15వ తేదీలోగా రుణాన్ని మాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని దుయ్యబట్టారు. కౌలు రైతులకు రూ. 12 వేల సాయం చేస్తామని చెప్పి, ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. సాగునీళ్లు ఇవ్వకపోవడంతో యాసంగి పంటలు ఎండి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల దృష్ట్యా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. కాగా, ముంజంపల్లిలో వినోద్‌కుమార్‌తో మహిళా రైతు మోలుగూరి శారద తన గోడు వెళ్లబోసుకున్నది. సర్కారు సాగునీరు ఇయ్యం అంటే తాము కౌలుకు తీసుకునే వాళ్లమే కాదని ఆవేదన వ్యక్తం చేసింది. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మానకొండూర్ సొసైటీ అధ్యక్షుడు నల్ల గోవింద రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎడ్ల సుగుణాకర్, ముంజంపల్లి మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు రొడ్డ పృథ్వీరాజ్, ముద్దసాని శ్రీధర్ రెడ్డి, సొసైటీ సీఈవో లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు ఎరుకల శ్రీనివాస్ గౌడ్, రెడ్డి సంపత్ రెడ్డి, నెల్లి శంకర్, మురళి, పిండి సందీప్, దండబోయిన శేఖర్, నందగిరి మల్లయ్యాచారి, బండ విజేందర్ రెడ్డి, బాలెంకి మల్లేశం, కాసం రాజగోపాల్, దుర్గం శివకుమార్, కొత్త వెంకట రెడ్డి, గోగూరి శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

ముంజంపల్లిలో సీఎం రేవంత్ రెడ్డికి రాసిన పోస్టు కార్డులను చూపుతున్న రైతులు

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముంజంపల్లి రైతులు రామంచ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు రాశారు. రూ. 2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ. 12 వేలు, క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలని పోస్టు కార్డులు రాసి పోస్ట్ చేశారు. గత హామీలను అమలు చేయని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు రామంచ గోపాల్ రెడ్డి, నందగిరి మల్లయ్యాచారి, బండ విజేందర్ రెడ్డి, కొత్త వెంకట రెడ్డి, పర్షయ్య, గోగూరి శ్రీనివాస్ రెడ్డి, గోగూరి నర్సింహారెడ్డి, గోగూరి లక్ష్మారెడ్డి, బాలెంకి మల్లేశం, ఎల్పుగొండ లింగయ్య, ఎల్పుగొండ పరశురాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు

గంగాధర, ఏప్రిల్ 23 : అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురిక్యాల లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయశ్రీ, బత్తుల లక్ష్మీనారాయణ, పెరుక శ్రవణ్, అన్నాడి రాజిరెడ్డి, వైద రామానుజం, తూము నారాయణ, కోల అశోక్, రేండ్ల రాజిరెడ్డి, రేండ్ల శ్రీనివాస్, ఆకుల మనోహర్, పెరుక మహేశ్ పాల్గొన్నారు.

బిలోలి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యేలు

బిలోలి కోర్టు వద్ద తెలంగాణ ఎమ్మెల్యేలు

కార్పొరేషన్, ఏప్రిల్ 23: తెలంగాణ రైతుల భూములకు నీటికోసం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన కేసులో మంగళవారం ఎమ్మెల్యేలు కోర్టుకు హాజరయ్యారు. బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బిలోలి సెషన్ కోర్టుకు హాజరైన వారిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, విజయరమణారావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు హనుమంతు షిండే, కేవీస్ రత్నం ఉన్నారు.

హోటళ్లలో కొనసాగుతున్న తనిఖీలు

కార్పొరేషన్, ఏప్రిల్ 23: నగరపాలక సంస్థ పరిధిలోని హోటల్స్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. రెండు రోజులుగా నగరంలోని హోటల్స్, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు చేస్తూ ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం చేపట్టిన తనిఖీల్లో పలు హోటళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని గుర్తించి, వాటి యజమానులకు రూ.22 వేల వరకు జరిమానా వసూలు చేశారు. నగరంలో ఎక్కడా కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకూడదని నగరపాలక అధికారులు పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది స్వామి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

ఘన్ముక్లలో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ

వీణవంక/ ఇల్లందకుంట, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. మంగళవారం వీణవంక మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వల్భాపూర్, వీణవంక, ఘన్ముక్ల, ఎలుబాక, చల్లూరు, అలాగే ఇల్లందకుంట మండలం మల్యాల, సిరిసేడు, ఇల్లందకుంటలోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, బూత్‌స్థాయి అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సిరిసేడులోని చెక్ పోస్టులో రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్‌ఐలు తోట తిరుపతి, ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు చేయాలా..? వద్దా..?

ఆందోళన చేస్తున్న అడ్తి, వ్యాపారులు, తదితరులు

జమ్మికుంట, ఏప్రిల్23: మార్కెట్‌లో సీజన్ ప్రారంభమైందని, ఎన్నికల నియమావళి పేరిట రైతులకు చెల్లించే నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని తెచ్చుకుంటున్న సమయంలో పట్టుకోవడం తగదని అడ్తిదారుల సంక్షేమ సంఘం, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఉత్పత్తులు కొనుగోళ్లు చేయాలా..? వద్దా..? చెప్పాలని డిమాండ్ చేశారు. నిబంధనల పేరిట పోలీసులు వ్యాపారులే లక్ష్యంగా బ్యాంకుల వద్ద పడిగాపులు ఎత్తివేయాలని, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎన్నికల నియమావళిలో భాగంగా వాహనాల తనిఖీలో ఓ వ్యాపారి వద్ద రూ.15లక్షలను పోలీసులు సీజ్ చేయడంపై మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో అడ్తిదారుల సంక్షేమ సంఘం, వ్యాపారులు, రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎన్నికల నియమావళి, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి జీ రెడ్డినాయక్‌కు వినతి పత్రం అందించారు. ఇక్కడ అడ్తిదారుల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుమార్, గౌరవాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వ్యాపారులు ప్రకాశ్, శ్యాం, తదితరులున్నారు.

'మద్యం రేషన్ పద్ధతిన కేటాయిస్తున్నాం'

రాంనగర్, ఏప్రిల్ 23 : ఐఎంఎల్ డిపోలో మద్యం సరఫరా విషయంలో రేషన్ పద్ధతి పాటిస్తున్నామని చీఫ్ మేనేజర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం కేటాయింపుల్లో అవకతవకలు జరుగుతున్నాయని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. డిమాండ్‌కు సరిపడా మద్యం అందుబాటులో లేకపోవడంతో రేషన్ పద్ధతిన కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు.

కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలె

- చే'నేత'ను పట్టించుకోని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలె
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి
- చేనేత సంఘంలోని స్టాక్ పరిశీలన

చేనేత స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, ఏప్రిల్23: 'అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌కు కళ్లు నెత్తికెక్కినయ్. చేనేత కార్మికులు తయారు చేసిన బట్టల స్టాక్ ఎక్కడికక్కడ స్టాక్ పేరుకు పోయింది. వెంటనే కొనుగోలు చేయాల్సింది. చే'నేత'ను పట్టించుకోని ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలె. కర్రుకాల్చి వాత పెట్టాలె. కార్మికులను కండోమ్‌లు అమ్ముకోమని అవహేళనగా మాట్లాడుతరా.. ఇంత అహంకారమా..? ప్రభుత్వం దిగిరావాలే. నేతన్నలను ఆదుకోవాలె.' అంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జమ్మికుంట పట్టణంలోని ఛత్రంజి చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. సంఘం అధ్యక్షుడు ఉడుత రమేశ్, పాలకవర్గం సభ్యులు, కార్మికులను కలిశారు. సంఘం పనితీరును పరిశీలించారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాముల్లో పేరుకుపోయిన స్టాక్‌ను చూశారు. తయారు చేసిన బట్టలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, కార్మికులకు బీమా, తదితర పథకాలు ప్రభుత్వం అమలు చేయని వైనాన్ని విన్నారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జమ్మికుంట సంఘంలో రూ.80లక్షలు, నియోజకవర్గంలో రూ.6కోట్లు, ఉమ్మడి జిల్లాలో రూ.15కోట్ల విలువైన చేనేత నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని, పేరుకుపోయిన వస్త్రాల నిల్వలను కొనుగోలు చేసి కార్మికులు ఆదుకోవాలని కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేనేత ఉత్పత్తులను కొనుగోళ్లు చేసి, కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. కార్మికుడు మృతి చెందితే రూ.5లక్షల బీమా అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నేతన్నలు అరిగోస పడుతున్నారని, కార్మికులను పట్టించుకోని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు పక్కనబెట్టి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. చేనేత స్టాక్‌ను కొనుగోలు చేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, నాయకులు, సంఘం సభ్యులు, తదితరులున్నారు.

సింగాపూర్ కిట్స్‌కు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు

అవార్డును తీసుకుంటున్న ఇంద్రనీల్

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 23: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు బ్రెనో విజన్ సంస్థ భారత్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. దేశంలోని కళాశాలలకు నాణ్యతా ప్రమాణాల ఆధారంగా ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తారని, ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరానికి సింగాపూర్ కిట్స్ కళాశాలను ఎంపిక చేశారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ మంగళవారం తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని వైఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ చేతుల మీదుగా కిట్స్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వొడితల ఇంద్రనీల్ భారత్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కెప్టెన్ వీ లక్ష్మీకాంతారావు, కళాశాల కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్, వివిధ విభాగాధిపతులు హర్షం వ్యక్తం చేశారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

తెలంగాణచౌక్,ఏప్రిల్23: ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులకు సాధించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశం, రాష్ట్ర యువత అధ్యక్షుడిగా పండుగ బాలు ముదిరాజ్ ఎన్నికైన సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముదిరాజ్ నాయకులు మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయసత్కార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సంఘం నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం,యువత అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దినేశ్, కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, కరీంనగర్ మార్కెట్ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, నాయకులు తిరుపతి, నరేందర్ పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ఘనంగా స్వాగతోత్సవం

తిమ్మాపూర్, ఏప్రిల్23: మండలంలోని రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'స్పార్క్ ఫెస్ట్ 2కే24' పేరుతో, అలాగే సీఎస్సీ, సీఎస్సీ(డేటా సైన్స్) విభాగాల ఆధ్వర్యంలో 'ప్రారంభ్' పేరుతో ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమాల్లో కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, విభాగాధిపతులు చంద్రమౌళి, సంధ్యా రెడ్డి, రమణారెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి ముగిసిన శిక్షణ

ముకరంపుర, ఏప్రిల్ 23: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో క్షేత్ర స్థాయి సిబ్బందికి రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఇప్పటి వరకు మొత్తం ఆరు బ్యాచుల్లో 778 మందికి విధి నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ పాల్గొని మాట్లాడుతూ, క్షేత్రస్థాయి సిబ్బంది విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా భద్రతాపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వినియోగదారులకు నిరంతర విద్యుత్తును అందించాలన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, లక్ష్మీరెడ్డి, ఏడీలు శ్రీనివాస్ రెడ్డి, రాజలింగం, శ్రీనివాస్, రాజేశం, పీవో చంద్రయ్య, మల్లేశం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 23 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో http://103.119.113.107:88, www. satavahana.ac.inలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

30 నుంచి ఫ్మారసీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 23 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 30 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్, బీ ఫార్మసీ 4వ సెమిస్టర్ పరీక్షలు 30 నుంచి, బీ ఫార్మసీ 3, 4, 5 వ సెమిస్టర్ సప్లిమెంటరీ, రెగ్యులర్ పరీక్షలు మే 1 నుంచి ప్రారంభమవుతాయని ప్రకటనలో వివరించారు. విద్యార్థుల కోసం యూనివర్సిటీ ఫార్మసీ పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు తెలిపారు.

న్యాయమూర్తి శ్రీవాణికి ఘనంగా వీడ్కోలు

న్యాయమూర్తి శ్రీవాణిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 23 : కరీంనగర్ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ శ్రీవాణి హైదరాబాద్ ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కోర్టు ఆవరణలోని మీడియేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ వీడ్కోలు సమావేశానికి జిల్లా జడ్జి బీ ప్రతిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయవాదులు కుసుంబా కృష్ణారావు, ఆర్ దేవేందర్ రెడ్డి, కనుకుల సంజీవ రెడ్డి, తనకు శ్రీరాములు, లింగంపల్లి నాగరాజు, కేవీ రమణారావు, కిరణ్ కుమార్, రావుఫ్, రజిని, అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి మాట్లాడారు. న్యాయమూర్తి శ్రీవాణి కేసుల సత్వర పరిష్కారంలో, విధి నిర్వహణలో తెచ్చుకున్న మంచి పేరు, న్యాయవాదులకు అందించిన సహకారాన్ని కొనియాడారు. జిల్లా జడ్జి బీ ప్రతిమ మాట్లాడుతూ, మొదటి అదనపు జిల్లా జడ్జిగా శ్రీవాణి తనకు అందించిన సహకారాన్ని తెలియజేశారు. బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి శ్రీవాణి మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాకు వచ్చినప్పుడు తనకు తల్లిగారింటికి వచ్చినట్లుందని, ఇక్కడ న్యాయవాదులు అందించిన సహకారం మర్చిపోలేనిదని, దాంతో తాను ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యవర్గం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, మహిళా న్యాయవాదులు న్యాయమూర్తి శ్రీవాణిని వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

సైదాపూర్, ఏప్రిల్23: సైదాపూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల వెంకటేశ్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చారు. దాతల సహాయంతో సేకరించిన లక్షాఇరవై వేల రూపాయలను వెంకటేశ్ కుటుంబసభ్యుల పేరుమీద పోస్టాఫీస్‌లో వేశారు. మంగళవారం బాండ్‌ను ఎస్ఐ ఆరోగ్యం చేతుల మీదుగా వారికి అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మునిపాల అశోక్, గడ్డం శేఖర్, బాలకృష్ణ, రమేశ్, అనిల్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేము సైతం యువసేన ఫౌండేషన్ ఔదార్యం

విద్యానగర్, ఏప్రిల్ 23 : మేము సైతం యువసేన ఫౌండేషన్ మంగళవారం వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి ఔదార్యాన్ని చాటింది. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన డయాలసిస్ బాధితుడు మల్లేశం కుటుంబం గడవలేని పరిస్థితి నెలకొన్నదని తెలియడంతో వారితోపాటు మరొక నిరుపేద కుటుంబానికి ఫౌండేషన్ సభ్యులు రైస్ బ్యాగులు, కిరాణా సామగ్రి అందించారు. అలాగే కూలి పని చేసుకునే పేద మహిళలకు చీరలు పంపిణీ, పిల్లలకు టవల్స్ వితరణ చేశారు. సుమారు 200 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, సాజిద్ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన టీఎంఎల్‌టీఏ సభ్యులు

విద్యానగర్, ఏప్రిల్ 23 : రాష్ట్ర ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ (టీఎంఎల్‌టీఏ) ఆధ్వర్యంలో బీఆర్కే భవన్‌లో మంగళవారం పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నూతన పీఆర్సీ, రిస్క్ అలవెన్స్ యూనిఫాం అలవెన్స్ వాషింగ్ అలవెన్సుల గురించి చర్చించారు. దీనికి పీఆర్సీ కమిటీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ నిజాం, ప్రధాన ప్రధాన కార్యదర్శి లాలులాల్, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు అఫ్తాబ్ అహమ్మద్ ఖాన్, శ్రీనివాస్, సమీ, కోటేశ్వరరావు, మొహమ్మద్ అజీజ్, ఏకాంతం, రఫీ మొహమ్మద్, సతీశ్, కలీం అన్సారి పాల్గొన్నారు.

టీసీసీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్23: టీసీసీ డ్రాయింగ్ పరీక్ష ఫలితాల్లో హుజూరాబాద్ కేసీ క్యాంప్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి సబ్బని మణిదీప్ 400 మార్కులకు గానూ 325 మార్కులతో డిక్టింక్షన్ సాధించినట్లు ప్రిన్సిపాల్ కామిశెట్టి కుమారస్వామి మంగళవారం తెలిపారు. పరీక్షలకు హాజరైన 11 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా మణిదీప్‌తోపాటు అతడికి శిక్షణ ఇచ్చిన ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ శారదను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. అలాగే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినిని, ప్రతిభ చూపిన విద్యార్థులను మండల విద్యాధికారి వెంకటనర్సింహారెడ్డి అభినందించారు.

నేటి రోడ్‌షోను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సతీశ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్, ఏప్రిల్ 23: మండలకేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ నిర్వహించే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నేడు రాత్రి 7గంటలకు జరిగే ఆయా కార్యక్రమాలకు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ తొంట ఓదెలు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇమామ్, మాజీ సర్పంచులు చంద శ్రీనివాస్, కొండ గణేశ్, తొంట కాంతమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్ షోకు భారీగా తరలి రావాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 23: కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించే రోడ్ షోకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ఒక ప్రకటనలో కోరారు.

పాఠశాలపై హైటెన్షన్ వైర్లు తొలగించాలి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 23: దుర్శేడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పైనుంచి ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు తొలగించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి జానకీదేవి మంగళవారం టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈకి వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో వైర్ల కింద పెద్ద వృక్షాలు ఉన్నాయని, గాలి దుమారం వచ్చినప్పుడు కొమ్మలు విరిగి వైర్లు తెగిపడితే విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంటుందని అందులో పేర్కొన్నారు.

● కేసీఆర్ 'బిగ్ డిబేట్'పై సర్వత్రా ఆసక్తి



భారత రాష్ట్ర సమితి అధినేత కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రముఖ న్యూస్ చానల్ టీవీ9 లైవ్ షో బిగ్ డిబేట్‌లో పాల్గొనగా, జిల్లా వ్యాప్తంగా ప్రజలు టీవీల ముందు కూర్చొని ఆసక్తిగా తిలకించారు. ఈ నెల 24 నుంచి చేపట్టనున్న బస్సుయాత్ర నేపథ్యంలో అన్ని వర్గాల వారు టీవీల ముందే కూర్చొని కార్యక్రమాన్ని తిలకించడం కనిపించింది.

- కరీంనగర్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

बैंक ऑफ़ बड़ौदा బ్యాంక్ ఆఫ్ బరోడా
బ్యాంక్ ఆఫ్ బరోడా
కరీంనగర్ శాఖ, 2-6-111, మార్కెట్ రోడ్డు
మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా, కరీంనగర్-505001

డిమాండ్ నోటీసు
(SARFAESI యాక్ట్ 2002లోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (2) క్రింద)

బ్యాంక్ ఆఫ్ బరోడా అయిన మేము మీరు పేర్కొన్న చిరునామాలకు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద దీనిలో తెలిపిన తేదీగల డిమాండ్ నోటీసును జారీ చేశాము. మీరు పేర్కొన్న చిరునామాలలో మీరు లేనందున/నోటీసు వాపసు వచ్చినందున/సరిగ్గా ఎక్నాలెడ్జ్ చేయబడనందున ఈ పత్రికా ప్రచురణ జారీ చేయబడినది. సదరు నోటీసులోని అంశాల ప్రకారం మీకు మంజూరైన వివిధ రుణాలలోని బకాయిల చెల్లింపులో మీరు విఫలమైనారు. తదుపరి వడ్డీ, వ్యయాలు మొదలైన వాటితో బకాయి మొత్తం దిగువ తెలుపబడినది.

రుణగ్రహీత పేరు: M/s. B.L. సిమెంట్ మార్కెటింగ్, ప్రొప్రైటర్: శ్రీ పవిత్రపు శ్రీధర్, ఇం.నం. 2-10-909, జ్యోతి నగర్, న్యూ లేబర్ అడ్డా దగ్గర, కరీంనగర్, తెలంగాణ-505001.
నిరర్థక ఆస్తిగా పేర్కొన్న తేది: 28-03-2024 **డిమాండ్ నోటీసు తేది: 30-03-2024**
బకాయి మొత్తం: 30-03-2024 నాటికి **రూ. 24,00,206.15** ప్లస్ తేది: 01-03-2024 నుండి వర్తించని వడ్డీ (29-02-2024 వరకు వడ్డీతోసహా)
స్థిరాస్తి షెడ్యూలు: ప్రాథమిక సెక్యూరిటీ: కరీంనగర్-505001, జ్యోతినగర్ లొకాలిటీ వద్ద గల సర్వే నం. 1115లోని 154.40 చదరపు గజాల విస్తీర్ణపు కొత్త నం. 2-10-909కు సంబంధించిన దాని ఇంటి నం. 2-10-700 (పాత) యొక్క సరిసమాన తనఖా. **సరిహద్దులు: ఉత్తరం:** 40 అడుగుల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ఇతరుల ఇం.నం. 2-10-910, **తూర్పు:** వెంకన్న మరియు గోపాల్ ఇల్లు, **పశ్చిమం:** ఇతరుల ఇం.నం. 2-10-910.

పైన తెలిపిన విధంగా చెల్లింపు చేయుటలో మీరు విఫలమైతే, వ్యయాలు, వాటి పరిణామాలకు పూర్తిగా మీ నష్టపూచీపై అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా ఎక్కువ సెక్యూర్డ్ ఆస్తులపై సదరు చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టుట బ్యాంక్‌కు తప్పనిసరి అవుతుంది. చట్టం క్రింద **బ్యాంక్ ఆఫ్ బరోడా**కు లభించే అధికారాలలో ఉన్నవి: (i) సెక్యూర్డ్ ఆస్తిని రాబట్టుకొనుటకు లీజు, అసైన్‌మెంట్ లేదా విక్రయం ద్వారా బదిలీ చేయుటకు హక్కులతో సహ రుణగ్రహీత సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకొనుటకు అధికారం (ii) సెక్యూర్డ్ ఆస్తిని రాబట్టుకొనుటకు లీజు, అసైన్‌మెంట్ లేదా విక్రయం ద్వారా బదిలీ చేయుటకు హక్కులతో సహ సెక్యూర్డ్ ఆస్తి మేనేజ్‌మెంట్ చేపట్టుట మరియు **బ్యాంక్ ఆఫ్ బరోడా** ద్వారా సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఏదేని బదిలీలో మీరు బదిలీ చేసినట్లుగానే బదిలీ చేసిన సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించి లేదా అన్ని హక్కులు సంక్రమిస్తాయి. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం ఈ నోటీసు స్వీకరణ తర్వాత **బ్యాంక్ ఆఫ్ బరోడా** ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా విక్రయం, లీజు లేదా ఇతర విధంగా (మీ వ్యాపార సాధారణ క్రమంలో కాకుండా) పైన తెలిపిన ఏవైనా సెక్యూర్డ్ ఆస్తులను మీరు బదిలీ చేయరాదని గమనించగలరు. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(13)లో పేర్కొన్న విధంగా పై నిబంధనను పాటించకపోతే SARFAESI చట్టంలోని సెక్షన్ 29 క్రింద శిక్షించదగు అపరాధమవుతుంది. సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం ఈ నోటీసు జారీ చేయబడినది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది.

తేది: 23-04-2024 **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం: కరీంనగర్ **బ్యాంక్ ఆఫ్ బరోడా**